సాక్షి ఖమ్మం

బుధవారం । 30 । అక్టోబర్ । 2024



మళ్లీ ఏఈఓల ఆందోళనబాట

ప్రభుత్వ హామీల అమల్లో జాప్యం జరుగుతోందంటూ ఏఈఓలు నేలపై కూర్చుని విధులు నిర్వర్తించారు. 8లో



కొంటారా.. వదిలేస్తారా ?!

మొక్కజొన్న పంట చేతికొస్తున్నా కొనుగోలు కేంద్రాలు మొదలుకాక ప్రైవేట్ వ్యాపారులు తక్కువ ధరకే దక్కించుకుంటున్నారు. 8లో



వాతావరణం

జిల్లాలో బుధవారం మధ్యాహ్నం వరకు సాధారణ ఉష్ణోగ్రతలే నమోదవుతాయి. సాయంత్రం తర్వాత చలి పెరిగే అవకాశముంది.

న్యూస్‌రీల్

రేపటి నుంచి ఖమ్మం మార్కెట్‌కు సెలవులు

ఖమ్మంవ్యవసాయం: దీపావళి, అమావాస్య, వారాంతపు సెలవుల నేపథ్యాన గురువారం నుంచి ఆదివారం వరకు నాలుగు రోజుల పాటు ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు సెలవులు ప్రకటించినట్లు ఉన్నత శ్రేణి కార్యదర్శి పి.ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఈనెల 31న గురువారం దీపావళి పండుగ, వచ్చేనెల 1న శుక్రవారం అమావాస్య, 2వ తేదీన శనివారం వారాంతపు సెలవు, 3న ఆదివారం సాధారణ సెలవుగా ప్రకటించినట్లు వెల్లడించారు. తిరిగి సోమవారం నుంచి మార్కెట్ కార్యకలాపాలు మొదలవుతాయనే విషయాన్ని రైతులు గమనించాలని సూచించారు.

డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ల జారీకి క్యాంపులు

ఖమ్మంగాంధీచౌక్: పెన్షన్‌దారులకు డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్లు జారీ చేసేందుకు తపాలా శాఖ ఆధ్వర్యాన ఉమ్మడి జిల్లాలో ప్రత్యేకంగా క్యాంపులు నిర్వహిస్తున్నట్లు పోస్టల్ సూపరింటెండెంట్ వి.వీరభద్రస్వామి తెలిపారు. ఖమ్మంలోని తపాలా డివిజన్ కార్యాలయంలో మంగళవారం వివరాలు వెల్లడించారు. ఏటా పెన్షన్‌దారులు ప్రభుత్వానికి డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించాల్సి ఉంటుందని, రూ.70 నామమాత్రపు ఫీజుతో పోస్టాఫీసుల్లో సర్టిఫికెట్లు పొందే అవకాశముందని తెలిపారు. డివిజన్ పరిధిలోని పలు పోస్టాఫీసుల్లో ఈ సౌకర్యం ఉండగా, సర్టిఫికెట్ల జారీకి ప్రత్యేక క్యాంపులను కూడా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నవంబర్ 4వ తేదీన ఖమ్మం హెడ్ పోస్టాఫీస్‌లో, 8న కొత్తగూడెం హెడ్ పోస్టాఫీస్‌లో, 16న ఖమ్మంలోని గాంధీచౌక్ సబ్ పోస్టాఫీస్‌లో, 25న భద్రాచలం పోస్టాఫీస్‌లో క్యాంపులు ఉంటాయని, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల పెన్షన్‌దారులు, ఈపీఎఫ్–95 పెన్షనర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూపరింటెండెంట్ కోరారు.

సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేపై శిక్షణ

ఖమ్మంమయూరిసెంటర్: వచ్చేనెల 6వ తేదీ నుంచి మొదలుకానున్న సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వేకు సంబంధించి సూపర్‌వైజర్లకు ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో మంగళవారం శిక్షణ ఇచ్చారు. కేఎంసీ పరిధిలో 25 బృందాలను ఏర్పాటు చేయగా, ఒక్కో ఎన్యుమరేటర్ 170 గృహాల్లో సర్వే చేయాల్సి ఉంటుంది. వీరిపైన సూపర్‌వైజర్లను నియమించారు. ఈమేరకు 11 పేజీలతో కూడిన ప్రశ్నావళి ఆధారంగా కుటుంబాల నుంచి వివరాలు సేకరించాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు. కాగా, శిక్షణ తీసుకున్న సూపర్‌వైజర్లు ఎన్యుమరేటర్లకు అవగాహన కల్పించి సర్వేలో పూర్తి వివరాలు సేకరించాలని చూడాలని సూచించారు.

అదనపు కలెక్టర్‌గా శ్రీనివాసరెడ్డి



కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌తో అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి

ఖమ్మం సహకారనగర్: జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా పి.శ్రీనివాసరెడ్డి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇన్నాళ్లు అదనపు కలెక్టర్‌గా ఉన్న మధుసూదన్‌నాయక్ మహబూబ్‌నగర్‌కు బదిలీ కాగా సిద్దిపేటలో విధులు నిర్వర్తిస్తున్న శ్రీనివాసరెడ్డిని జిల్లాకు కేటాయించిన విషయం విదితమే. ఈ మేరకు కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌ను మర్యాదపూర్వకంగా కలిశాక ఆయన విధుల్లో చేరారు.

డీఎంహెచ్‌ఓగా కళావతిబాయి



ఖమ్మంవైద్యవిభాగం: జిల్లా ఇన్‌చార్జ్ వైద్య, ఆరోగ్య శాఖ అధికారిగా బి.కళావతి బాయి నియమితులయ్యారు. ఈమేరకు వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ సెక్రటరీ క్రిస్టినా జడ్ చోంగ్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఆమె ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సివిల్ సర్జన్ ఆర్‌ఎంఓగా కొనసాగుతున్నారు. ఇక్కడ డీఎంహెచ్‌ఓగా ఉన్న వి.సుబ్బారావు ఈ ఏడాది ఆగస్టులో ఇన్‌చార్జ్ గా బాధ్యతలు స్వీకరించారు. మున్నేరు, ఆకేరు వరద ప్రభావిత ప్రాంతాల్లో వ్యాధుల కట్టడికి జ్వర సర్వే చేయించడమే కాక ఇతర కార్యక్రమాలతో ఉన్నతాధికారుల మన్ననలు పొందారు. కాగా, కళావతిబాయిని ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌ఓగా నియమించడంతో సుబ్బారావు ఇకపై పూర్వ స్థానమైన జిల్లా క్షయ నివారణ అధికారిగా కొనసాగనున్నారు.

వ్యాపారుల వైపే మొగ్గు

జిల్లాలో పత్తి కొనుగోళ్లకు మొదలైన సీసీఐ కేంద్రాల్లో నయా దందాకు తెరలేపారు. రైతుల మాటున వ్యాపారులు తీసుకొచ్చిన పత్తిని చకచకా కొనుగోలు చేస్తుండగా.. అసలైన రైతులు వస్తే మాత్రం తేమ పేరిట నిరాకరిస్తుండడంతో పడిగాపులు కాయాల్సి వస్తోంది. జిల్లాలో మంగళవారం నాటికి రెండు కేంద్రాల నుంచి 526.3 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేశారు. రైతుల పేరిట వ్యాపారులు పత్తి తీసుకొస్తున్నా చిరునామా, ఇతర వివరాలు సేకరించకుండానే కొనుగోలు చేస్తుండడం అనుమానాలకు తావిస్తోంది.

– సాక్షి ప్రతినిధి, ఖమ్మం



తేమ ఎక్కువగా ఉందని గుర్రాలపాడు సీసీఐ కేంద్రం వద్ద పక్కన పెట్టిన పత్తి వాహనాలు

బినామీ రైతుల పేరిట సీసీఐ కేంద్రాల్లో దందా

- చిరునామా సేకరించకుండానే కొనుగోళ్లు
- కుమ్మక్కవుతున్న వ్యాపారులు – కేంద్రాల నిర్వాహకులు
- రైతులకు మాత్రం తేమ శాతం పేరిట మొండిచేయి

ఒక్కటొక్కటిగా ప్రారంభం

తిరుమలాయపాలెం మండలంలోని పాతర్లపాడు, మధిర మండలంలోని మాటూరులో సీసీఐ కొనుగోలు కేంద్రాలు మంగళవారం మొదలయ్యాయి. ఇక ఖమ్మం మార్కెట్ పరిధిలోని గుర్రాలపాడు జీఆర్‌ఆర్ కాటన్ జిన్నింగ్ మిల్లులో ఇప్పటి వరకు 14 మంది రైతుల నుంచి 367.5 క్వింటాళ్లు, నేలకొండపల్లి మార్కెట్ పరిధి ముదిగొండ మండలంలోని ఉష జిన్నింగ్‌మిల్లులో 9 మంది రైతులకు చెందిన 158.8 క్వింటాళ్ల పత్తి కొనుగోలు చేశారు. మంగళవారం ప్రారంభించిన కేంద్రాల్లో పత్తి కొనుగోళ్లు మొదలుకావాల్సి ఉంది.

రైతుల ముసుగులో వ్యాపారులు

ప్రైవేట్ వ్యాపారుల వద్ద రైతులకు సరైన ధర లభించకపోవడంతో ప్రభుత్వం సీసీఐ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయిస్తోంది. అయితే, ఈ కేంద్రాల్లో రైతులకు చుక్కెదురవుతోంది. వ్యాపారులు కేంద్రాల నిర్వాహకులను తమకు అనుకూలంగా మార్చుకుని ఇప్పటికే రైతుల నుంచి కొనుగోలు చేసిన పత్తినే బినామీ పేర్లతో సీసీఐ కేంద్రాల్లో విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. తాము పెట్టుబడి పెట్టిన, పత్తి కొనుగోలు చేసిన రైతుల పేరుతో అమ్మకాలు చేస్తుండడంతో రైతుల ఖాతాల్లో నగదు జమ అవుతోంది. కానీ సరైన ఆధారాలు లేవనే సాకుతో అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.

ఆ రైతుల అడ్రస్ ఏదీ?

జిల్లాలోని రెండు కేంద్రాల్లో పత్తి కొనుగోళ్లు జరుగుతుండగా ఉన్నతాధికారుల పర్యవేక్షణ కరువైంది. ఆధార్ లేదా ఇతర గుర్తింపు కార్డుల్లో ఉన్న రైతుల చిరునామా ఆధారంగా పత్తి కొనుగోలు చేయాలి. కానీ సీసీఐ కేంద్రంలో పత్తి విక్రయించిన వారి పేర్లు మాత్రమే రాస్తూ చిరునామా నమోదు చేయడం లేదు. ఇదే అదునుగా కేంద్రాల నిర్వాహకులతో వ్యాపారులు కుమ్మక్కై పత్తి విక్రయిస్తున్నట్లు సమాచారం. గుర్రాలపాడు సీసీఐ కేంద్రంలో ఇప్పటి వరకు పత్తిని విక్రయించిన రైతుల పేర్లు, చిరునామా అడిగితే కేవలం పేరు, పంట వివరాలు, వారికి చెల్లించాల్సిన డబ్బుల వివరాలు మాత్రమే చూపడం గమనార్హం.

గోస పడుతున్న రైతులు

వాతావరణం సహా ఇతర ఇబ్బందులను అధిగమించి సాగు చేసిన పత్తిని అమ్ముకోవడానికి రైతులు యుద్ధమే చేయాల్సి వస్తోంది. ప్రైవేట్ వ్యాపారుల వద్ద ధర నచ్చక సీసీఐ కేంద్రాలకు తీసుకొస్తే 8 నుంచి 12 శాతం తేమ ఉంటేనే కొనుగోలు చేస్తామని కరాఖండిగా చెబుతున్నారు. పత్తిలో 18 నుంచి 20 శాతం తేమ ఉందని చెబుతుండడంతో రోజుల తరబడి కేంద్రాల్లో ఉండాల్సి రాగా, వాహనాల అద్దె, ఇతర ఖర్చులు పెరిగిపోతున్నాయి. ఖమ్మంరూరల్ మండలంలోని గుర్రాలపాడులో సీసీఐ కేంద్రాన్ని ఈనెల 21న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభించగా ఇప్పటివరకు కేవలం 14 మంది రైతుల నుంచి 367.5 క్వింటాళ్ల పత్తి కొనుగోలు చేశారు. తేమ ఎక్కువ ఉందనే కారణంతో నిరాకరించగా దాదాపు 20 మంది రైతులు 25 వాహనాల్లో తీసుకొచ్చిన పత్తితో వేచి ఉన్నారు. పత్తిని ఎండబెట్టి తీసుకొచ్చినా తేమ శాతం పేరిట గోస పెడుతున్నారని రైతులు ఆవేదన చెందుతున్నారు.



సీసీఐ కేంద్రంలో నిరీక్షిస్తున్న రైతులు

వ్యాపారుల నుంచి కొనుగోలు చేయం

ప్రభుత్వ నిబంధనల మేరకు 8 – 12 శాతం తేమ ఉన్న పత్తి కొనుగోలు చేస్తున్నాం. ఈ కేంద్రానికి ప్రైవేట్ వ్యాపారులు పత్తిని తీసుకొస్తే ఎట్టి పరిస్థితుల్లో కొనుగోలు చేయబోం. నిబంధనల ప్రకారం తేమ ఉండి.. రైతులు తీసుకొచ్చిన పత్తిని మాత్రమే కొనుగోలు చేస్తాం.

– జి.అనిల్‌కుమార్, అసిస్టెంట్ ఇన్‌చార్జి, గుర్రాలపాడు సీసీఐ కేంద్రం

నిబంధనల మేరకే కొనుగోళ్లు

నిబంధనల మేరకే సీసీఐ పత్తి కొనుగోలు చేస్తోంది. ప్రస్తుత వాతావరణంతో తేమ ఎక్కువగా ఉంటోంది. దీపావళి తర్వాత ఎండబెట్టి తీసుకురావాలే తప్ప ఇప్పుడే వచ్చి ఇబ్బంది పడొద్దు. నిజమైన రైతుల నుంచే పత్తి కొనుగోలు చేస్తాం తప్ప ఇతరుల నుంచి తీసుకోం.

– ఎం.ఏ.అలీం, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి

పత్తి కొనుగోలు చేయడం లేదు..



రెండు రోజుల క్రితం గుర్రాలపాడుకు 20 క్వింటాళ్ల పత్తి తీసుకొచ్చా. తేమ 18శాతం ఉందని నిరాకరించడంతో కేంద్రం వద్దే ఉన్నా. పత్తి తీసుకొచ్చిన వాహనానికి రోజూ రూ.వెయ్యి అద్దె కట్టాల్సి వస్తోంది. ఎప్పుడు కొనుగోలు చేస్తారో తెలియక ఎటూ తోచడం లేదు.

– గుగులోతు కోటేష్, రాంక్యాతండా, రఘునాథపాలెం మండలం

పగలూరాత్రీ ఉంటున్నాం..



20 శాతం తేమ ఉందని గుర్రాలపాడు సీసీఐ కేంద్రానికి తీసుకొచ్చిన 22 క్వింటాళ్ల పత్తిని కొనలేదు. దీంతో పత్తి అమ్ముకునే వరకు తిరిగి వెళ్లలేక రాత్రింబవళ్లు ఇక్కడే ఎదురుచూస్తున్నాం. ప్రభుత్వం మద్దతు ధరతో కొనుగోలు చేస్తామన్న మాట నెరవేరడం లేదు.

– భూక్యా రజని, ఈర్లపుడి, రఘునాథపాలెం

డెయిరీతో అదనపు ఆదాయం

- ప్రతీ సభ్యురాలికి సబ్సిడీపై రెండు పాడి పశువులు
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- ఇందిరా మహిళా డెయిరీ లోగో ఆవిష్కరణ



మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పక్కన కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ తదితరులు

మధిర: దేశమంతా మధిర వైపు చూసేలా ఇందిరా మహిళా డెయిరీని విజయపథంలో నడిపించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సూచించారు. మధిరతో పాటు సిరిపురంలో మంగళవారం పర్యటించిన ఆయన సిరిపురంలో రూ.26కోట్లతో చేపట్టే సిరిపురం – నెమలి రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన చేశారు. అలాగే, మాటూరులో సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఆతర్వాత మధిరలో నిర్వహించిన సమావేశంలో ఇందిరా మహిళా డెయిరీ లోగోను ఆవిష్కరించి మాట్లాడారు. సాగర్ కాల్వలతో నియోజకవర్గ రైతులు పంటలు సాగు చేస్తుండగా, అదనపు ఆదాయం సమకూర్చేందుకు ఇందిరా మహిళా డెయిరీకి రూపకల్పన చేశామని తెలిపారు. మహిళా సంఘాల సభ్యులకు సబ్సిడీపై రెండు చొప్పున పాడిగేదెలు అందచేస్తామని, ఆపై గ్రామాల్లోనే సేకరించడం ద్వారా వారు ఆర్థికాభివృద్ధి సాధిస్తారని తెలిపారు. రోజూ 2.40లక్షల లీటర్ల పాల ఉత్పత్తి ద్వారా నెలకు రూ.25కోట్ల ఆదాయం వస్తుందని, పాలు, అనుబంధ ఉత్పత్తుల అమ్మకంతో ఏటా డెయిరీ టర్నోవర్ రూ.500 కోట్లు దాటుతుందని భట్టి ధీమా వ్యక్తం చేశారు.

2013లోనే భూమిపూజ

డెయిరీ ఏర్పాటుకు 2013లో 9.5ఎకరాల స్థలం సేకరించి భూమి పూజ కూడా చేశామని.. కానీ గత ప్రభుత్వం మహిళల సంక్షేమాన్ని విస్మరించిందని భట్టి ఆరోపించారు. అంతేకాక మహిళలు చెల్లించిన వాటాధనాన్ని కాజేసినట్లు తప్పుడు ప్రచారం చేశారని చెప్పారు. ప్రస్తుతం ఆ నగదు రూ.40లక్షల మేర ఉండగా, ఇందిరా మహిళా డెయిరీలో సభ్యులకు రెండు చొప్పున పాడి పశువులు సబ్సిడీపై అందిస్తామని తెలిపారు. ప్రతీ సభ్యురాలు ఆర్థికాభివృద్ధి సాధించి మరొకరికి సాయం చేసే దిశగా ఎదగాలని ఆకాంక్షించారు. ఇక ఐదు మండలాల్లోని నిరుద్యోగ యువతకు పశువుల దాణా తయారీ, ప్యాకింగ్, సరఫరా యూనిట్లు కేటాయిస్తామని తెలిపారు. కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ పాడి పశువులతో ఆర్థికంగా నిలదొక్కుకుంటే పిల్లలకు మెరుగైన విద్య అందిచొచ్చని తెలిపారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల్లోని అన్ని గ్రామాలలో పాల సేకరణ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని, మండల కేంద్రంలో బల్క్ మిల్క్ చిల్లింగ్ యూనిట్లు ఏర్పాటవుతాయని చెప్పారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, డీఆర్డీఓ సన్యాసయ్య, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి వేణుమనోహర్, ఇందిరా మహిళా డెయిరీ చైర్ పర్సన్ అన్నపూర్ణ తదితరులు అధికారులు పాల్గొన్నారు.

రూ.637 కోట్లతో ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు





బారుగూడెంలో అదనపు తరగతి గదుల నిర్మాణానికి శంకుస్థాపన చేసిన మంత్రి పొంగులేటి (ఇన్‌సెట్) తిరుమలాయపాలెం పాఠశాలలో బాలికలకు సైకిళ్లు పంపిణీ చేస్తూ..

- ప్రైవేట్‌కు దీటుగా నాణ్యమైన విద్య
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ఖమ్మంరూరల్: రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో అవసరమైన వసతుల కల్పనకు రూ.637కోట్లు కేటాయించిన ఘనత తమకే దక్కుతుందని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. ఖమ్మం రూరల్ మండలంలోని రాజీవ్ గృహకల్ప, బారుగూడెంలలోని ప్రభుత్వ పాఠశాలల్లో అదనపు తరగతి గదుల నిర్మాణానికి ఆయన మంగళవారం శంకుస్థాపన చేశారు. ఆతర్వాత గోళ్లపాడు ఉన్నత పాఠశాలల్లో పీఎస్‌ఆర్ ట్రస్ట్ ద్వారా బాలికలకు సైకిళ్లు పంపిణీ చేసి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాల అంటే సౌకర్యాలు ఉండవని, చదువు సరిగా చెప్పరనే అపోహను తొలగించేలా అన్ని సౌకర్యాలు సమకూరుస్తూ ఉపాధ్యాయుల నియామకం చేపట్టామని తెలిపారు. ప్రతీ మండలంలోని ఒక పాఠశాలలో సైన్స్ ల్యాబ్ అవసరంపై డీఈఓ తన దృష్టికి తీసుకొచ్చారని, వ్యక్తిగతంగా నాలుగు మండలాల్లో ఒక్కో పాఠశాలకు రూ.2లక్షల చొప్పున రూ. 8లక్షలు ఇవ్వనున్నట్లు ప్రకటించారు. ఇది విజయవంతమైతే నియోజకవర్గంలోని అన్ని పాఠశాలల్లో ల్యాబ్‌లు ఏర్పాటు చేస్తానని తెలిపారు. అంతేకాక స్కిల్ యూనివర్సిటీ బ్రాంచ్ కూడా పాలేరు నియోజకవర్గంలో ఏర్పాటు చేయిస్తానని మంత్రి వెల్లడించారు. అనంతరం ఆరేకోడులో పలు పార్టీల నాయకులు కాంగ్రెస్‌లో చేరగా వారికి మంత్రి కండువాలు కప్పి ఆహ్వానించారు.

తల్లిదండ్రుల ఆశలను నెరవేర్చాలి

తిరుమలాయపాలెం: రాష్ట్రప్రభుత్వం సమకూరుస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని పిల్లలు ఉన్నత స్థాయికి చేరడం ద్వారా తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సూచించారు. తిరుమలాయపాలెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో మండలంలో 8, 9, 10వ తరగతి చదువుతున్న 157 మంది బాలికలకు పీఎస్‌ఆర్ ట్రస్ట్ ద్వారా సైకిళ్లు పంపిణీ చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ కష్టపడితే ఫలితం ఉంటుందని, కష్టం ద్వారా వచ్చిన ఫలితమే నిలబడుతుందని చెప్పారు. కాగా, అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఆర్వో ప్లాంట్లు ఏర్పాటుచేస్తానని, బాలికలకు సైకిళ్లు ఇస్తుండగా బాలురకు ఏం చేయాలో ఆలోచిస్తున్నామని మంత్రి తెలిపారు. ఈకార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర నీటిపారుదల అభివృద్ధి సంస్థ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు, డీఈఓ సోమశేఖరశర్మ, ఎంఈఓ శ్రీనివాసరావు, తహసీల్దార్ బి.రాంప్రసాద్, హెచ్‌ఎం వెంకట్రావుతో పాటు నాయకులు, ప్రజాప్రతినిధులు బి.హరినాథ్‌బాబు, కన్నేటి నర్సింహారావు, మద్ది వీరారెడ్డి, బండి జగదీష్, మల్లారెడ్డి, నరేందర్ రెడ్డి, నరేష్‌రెడ్డి, బెల్లం శ్రీనివాస్, చావా శివరామకృష్ణ, జడల నగేష్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానంతో ఆపదలో ఉన్న వారికి ప్రాణదానం

పోలీసు కమిషనర్ సునీల్‌దత్

నేలకొండపల్లి: రక్తదానం చేయడమంటే ఆపదలో ఉన్న వారికి ప్రాణదానం చేసినట్లేనని ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ తెలిపారు. పోలీసు అమరవీరుల వారోత్సవాల సందర్భంగా ఖమ్మం రూరల్ సబ్ డివిజన్ ఆధ్వర్యాన నేలకొండపల్లి మార్కెట్‌లో మంగళవారం నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని సీపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా 735 మంది రక్తదానం చేయగా వారికి సీపీ సర్టిఫికెట్లు అందజేసి మాట్లాడారు. సకాలంలో రక్తం అందక ఎందరో ప్రాణాలు కోల్పోతున్నారని చెప్పారు. ఈమేరకు ఆరోగ్యవంతులైన ప్రతీ ఒక్కరు రక్తదానం చేయాలని సూచించారు. అలాగే, యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండి సన్మార్గంలో పయనించాలని తెలిపారు. అడిషనల్ డీసీపీ ప్రసాద్‌రావు, ఏసీపీ తిరుపతిరెడ్డి, సీఐలు సంజీవ్, మురళీ, డీసీఎంఎస్ డైరెక్టర్ నాగుబండి శ్రీనివాసరావు, మార్కెట్ చైర్మన్ సీతారాములుతో పాటు బ్రహ్మయ్య, పసుమర్తి శ్రీనివాస్, గండు సతీష్, కొర్లకుంట్ల నాగేశ్వరరావు, రమేష్, వై.జానకీరామయ్య, వెంకన్న, బచ్చలకూరి నాగరాజు, జెర్రిపోతుల అంజిని, గుండా బ్రహ్మం, కడియాల నరేష్, హన్మంతరావు తదితరులు పాల్గొన్నారు.



రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న సీపీ సునీల్‌దత్

గ్యారంటీతో మిల్లర్లకు ధాన్యం కేటాయింపు

ఖమ్మం సహకారనగర్: ఖరీఫ్‌లో రైతులు సాగు చేసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తుండగా.. మిల్లర్లకు గ్యారంటీతో కేటాయించనున్నామని పౌర సరఫరాల శాఖ కమిషనర్ డీఎస్.చౌహాన్ స్పష్టం చేశారు. హైదరాబాద్ నుంచి మంగళవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. జీఓ 27 ప్రకారం డీఫాల్ట్ కాని మిల్లులకు 10శాతం బ్యాంక్ గ్యారంటీతో ధాన్యం ఇవ్వాలని నిర్ణయించామన్నారు. ఇదేసమయాన డీఫాల్ట్ అయి జరిమానా సహా చెల్లించిన మిల్లులకు 20శాతం బ్యాంక్ గ్యారంటీ లేదంటే 25శాతం సెక్యూరిటీతో ధాన్యం కేటాయిస్తామని చెప్పారు. జిల్లా నుంచి అదనపు కలెక్టర్ శ్రీజ మాట్లాడుతూ 323 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనుండగా, ఇప్పటికే 39సెంటర్లు తెరిచామని చెప్పారు. జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి చందన్ కుమార్, మేనేజర్ శ్రీలత పాల్గొన్నారు.

సీడ్ కార్పొరేషన్‌కు అనుబంధంగా విత్తన సేకరణ



సీడ్ కార్పొరేషన్ ఎండీతో పీఏసీఎస్‌ల చైర్మన్లు, కార్యదర్శులు

ఖమ్మంఅర్బన్: జిల్లాలో సీడ్ కార్పొరేషన్‌కు అనుబంధంగా విత్తన సేకరణ కోసం రెండు సహకార సంఘాలు ఎంపికయ్యాయి. రఘునాథపాలెం మండలంలోని వి.వెంకటాయపాలెం, చింతకాని మండలంలోని నాగులవంచ పీఏసీఎస్‌లు ఎంపిక కాగా, వీటి ద్వారా వివిధ ప్రాంతాల్లో రైతులు పండించిన పంటల నుంచి విత్తనాల సేకరణ చేపడుతారు. ఇందుకోసం రూ.38 లక్షల చొప్పున కేటాయించనున్నారు. నాణ్యమైన వరి, మొక్కజొన్న తదితర విత్తనాలను రైతులకు సమకూర్చి సాగు చేయించడమే కాక పంట చేతికొచ్చాక విత్తనాలు సేకరించి కార్పొరేషన్‌కు సరఫరా చేసేలా కార్యాచరణ రూపొందించారు. ఈమేరకు జిల్లా సహకార అధికారి గంగాధర్ రావు, సొసైటీల చైర్మన్లు, కార్యదర్శులు రావూరి సైదబాబు, నల్లమోతు శేషగిరిరావు, ఐతగాని తిరుపతిరావు, శ్రీనివాసరావు మగళవారం రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును, సీడ్ కార్పొరేషన్ ఎండీ ఉదయ్‌కుమార్‌ను కలిశారు.

నేత్రపర్వంగా రామయ్య నిత్య కల్యాణం

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి నిత్యకల్యాణ వేడుక మంగళవారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కాగా, మంగళవారాన్ని పురస్కరించుకుని శ్రీ అభయాంజనేయస్వామి వారికి అభిషేకం, తమలపాకులతో అర్చన గావించారు.

డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్లు పరిశీలన



సర్టిఫికెట్ల పరిశీలన వివరాలు తెలుసుకుంటున్న జెడ్పీ సీఈఓ దీక్ష

ఖమ్మం సహకారనగర్: డీఎస్సీ–2024లో స్పెషల్ ఎడ్యుకేషన్ విభాగం నుంచి ఎస్‌జీటీలు, స్కూల్ అసిస్టెంట్లుగా ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన మంగళవారం ఖమ్మం డైట్ కళాశాలలో మొదలైంది. ఎస్‌జీటీ అభ్యర్థులు 67మందికి 41మంది, స్కూల్ అసిస్టెంట్లలో 21మందికి 18మంది హాజరయ్యారని డీఈఓ సోమశేఖరశర్మ తెలిపారు. డైట్ కళాశాలలో జెడ్పీ సీఈఓ దీక్షా రైనా పరిశీలించి ఉద్యోగులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డీఈఓ కార్యాలయ ఉద్యోగులు చావా శ్రీనివాసరావు, వజ్జా కిషోర్‌కుమార్, వై.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు ఎంపీ రఘురాంరెడ్డి పర్యటన

ఖమ్మంవన్‌టౌన్: ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి బుధవారం ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో పర్యటించనున్నారు. బుధవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి గంట పాటు ఖమ్మం ఎస్‌ఆర్ గార్డెన్స్ సమీపంలోని నివాసంలో ప్రజలు, పార్టీ శ్రేణులను కలుస్తారు. ఆ తర్వాత కొత్తగూడెంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పుట్టిన రోజు సందర్భంగా నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు హాజరవుతారు.

13నుంచి ఎద్దుల బలప్రదర్శన, కబడ్డీ పోటీలు

నేలకొండపల్లి: కార్తీకపౌర్ణమి సందర్భంగా నేలకొండపల్లి మండలంలోని రాజేశ్వరపురంలో ఎద్దుల బలప్రదర్శన, కబడ్డీ పోటీలు నిర్వహించనున్నారు. ఏటా మాదిరిగానే రెండు రాష్ట్రాల స్థాయి పోటీలను వచ్చేనెల 13, 14, 15వ తేదీల్లో నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. ఈ రెండు పోటీలకు తెలంగాణ, ఏపీ నుంచి ఎంట్రీలు వస్తున్నాయని వెల్లడించారు.

'అన్నం'కు సేవా పురస్కారం



శ్రీనివాసరావును సన్మానిస్తున్న ఆర్టీసీ ఎండీ సజ్జనార్

ఖమ్మంఅర్బన్: అనాథలు, దివ్యాంగులకు చేస్తున్న సేవలకు గుర్తింపుగా అన్నం ఫౌండేషన్ అధ్యక్షుడు అన్నం శ్రీనివాసరావుకు సేవా పురస్కారం లభించింది. హైదరాబాద్‌లో మంగళవారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఆర్టీసీ ఎండీ సజ్జనార్, టీజీటీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు ఆయనకు పురస్కారం అందజేసి సన్మానించారు. భద్రాద్రి జిల్లా యంగ్ ఇండియన్ బ్లడ్ డోనర్స్ క్లబ్ చైర్మన్ జె.బాలు ఆధ్వర్యాన యంగ్ ఇండియన్స్ సేవా పురస్కారాలు పలువురికి అందించగా జాబితాలో అన్నం శ్రీనివాసరావుకు సైతం స్థానం దక్కింది. ఈ కార్యక్రమంలో ఎంపీఐ వెంకటపుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రమిదల ఆకారంలో విద్యార్థులు



ముదిగొండ: దీపావళి పండుగ సందర్భంగా మండలంలోని యడవల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలల విద్యార్థులు ప్రమిదల ఆకారంలో ప్రదర్శన ఇచ్చారు. ఈ సందర్భంగా దీపావళి పండుగ ప్రత్యేకతలను ఉపాధ్యాయులు వివరించారు. హెచ్‌ఎంలు ఎం.నాగలక్ష్మి, టి.మల్ల, ఉపాధ్యాయులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.17,043

కొంటారా.. వదిలేస్తారా?!

- జాడలేని మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు
- నాణ్యత పేరిట వ్యాపారుల నిలువుదోపిడీ
- పెట్టుబడి కూడా రావడం లేదని రైతుల ఆవేదన
- ఉమ్మడి జిల్లాలో 88 వేలకు పైగా ఎకరాల్లో పంట సాగు



కొమరారం వైకుంఠధామంలో మొక్కజొన్నలపై పట్టా కప్పుతున్న రైతులు

ఇల్లెందురూరల్: వాతావరణం అనుకూలించలేదు.. చీడపీడలు నీడలా వెంటాడాయి.. ఆపై అధిక వర్షాలు ఇబ్బంది పెట్టాయి.. అయినా చెమటోడ్చి మొక్కజొన్న సాగు చేసిన రైతులను దోచుకోవడంలో ఇప్పుడు దళారులు తమ వంతు పాత్ర పోషిస్తున్నారు. అతివృష్టితో భగవంతుడు రైతుల ఆశలపై నీళ్లు చల్లగా.. దళారులు ధరలో దగాతో వారి శ్రమను దోచుకుంటున్నారు. ఇదంతా తెలిసినా ప్రభుత్వ పరంగా మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేయకపోవడంతో పెట్టుబడి కూడా రావడం లేదని రైతులు దిగులు పడుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో ఇలా..

భద్రాద్రి జిల్లాలో మొక్కజొన్న సాగు విస్తీర్ణం అధికారిక గణాంకాల ప్రకారం 85,823 ఎకరాలుగా నమోదైంది. కానీ పట్టాలు లేని రైతులు సాగుచేసిన సుమారు 5వేల ఎకరాలు కలిపితే మొక్కజొన్న సాగు విస్తీర్ణం సుమారు 90వేల ఎకరాలుగా ఉంటుంది. ఇక ఖమ్మం జిల్లాలో 2,300 ఎకరాల్లో సాగైనట్లు అంచనా. అయితే, అనధికారికంగా లెక్కేస్తే ఉమ్మడి జిల్లాలో మొక్కజొన్న సాగు లక్ష ఎకరాలు దాటుతుందని చెబుతున్నారు. సాధారణంగా మొక్కజొన్న ఖరీఫ్‌లో ఎకరానికి 25 క్వింటాళ్లు, రబీలో 40 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. కానీ ఈ దఫా వాతావరణ పరిస్థితులు అనుకూలించని కారణంగా ఎకరాకు 10 క్వింటాళ్ల నుంచి 15 క్వింటాళ్లు దాటడం లేదని రైతులు చెబుతున్నారు. ఎకరానికి 15 క్వింటాళ్ల చొప్పున లెక్కించినా 90 వేల ఎకరాల నుంచి 13.50 లక్షల క్వింటాళ్ల మొక్కజొన్న మార్కెట్‌కు చేరే అవకాశం ఉంది.

దెబ్బమీద దెబ్బ..

ఖరీఫ్ ఆరంభంలో వర్షాభావంతో విత్తనాలు మొలకెత్తలేదు. దీంతో రెండో సారి విత్తనాలు వేయాల్సి రావడంతో పెట్టుబడి ఖర్చు పెరిగింది. ఇక మొక్క ఎదుగుతున్న దశలో వర్షాభావం.. ఆ తర్వాత అధిక వర్షాలు కోలుకోకుండా చేశాయి. కంకి పాలుపోసే, గింజ పక్వానికి వచ్చే దశల్లో ప్రతికూల వాతావరణ పరిస్థితులు మొక్కజొన్న దిగుబడిపై ప్రభావం చూపాయి. దీంతో ఎకరాకు కనీసం 20 క్వింటాళ్లకు బదులు పది నుంచి 15 క్వింటాళ్ల దాటలేదని రైతులు వాపోతున్నారు. ఓ పక్క పెట్టుబడి పెరగగా సరైన దిగుబడి లేకపోవడం వారిని కుంగదీస్తోంది.

జాడలేని కొనుగోలు కేంద్రాలు..

మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ఏటా అక్టోబర్ చివరి వారంలోనే ఏర్పాటు చేస్తుంది. దీంతో రైతులు ఆశతో తేమ తగ్గేలా మొక్కజొన్నలను కల్లాలు, రహదారులపై ఆరబెట్టారు. అయితే, కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై ఎలాంటి ప్రకటన లేకపోవడం గమనార్హం. ఈసారి ప్రభుత్వం మొక్కజొన్న మద్దతు ధర క్వింటాకు రూ.2,225గా నిర్ణయించింది. కానీ ప్రభుత్వ పరంగా కేంద్రాలు ఏర్పాటుకాకపోవడంతో చాలా మంది రైతులు బయట వ్యాపారులకు విక్రయిస్తున్నారు. క్వింటా రూ.2,300 చెల్లిస్తున్నట్లు వ్యాపారులు చెబుతున్నా.. హమాలీ, ట్రాక్టర్ కిరాయి, తరుగు కోతలు లెక్కిస్తే రైతులకు క్వింటాకు రూ.2వేలు కూడా దక్కడం లేదు.



రైతులు ఆరబెట్టిన మొక్కజొన్న రాశులు

అడుగడుగునా మోసం..

ఏజెన్సీ ప్రాంత రైతులను ధరతోపాటు తూకంలోనూ వ్యాపారులు మోసం చేస్తున్నారు. నేటికీ రాళ్లబాట్లు, ముళ్ల త్రాసులతో మొక్కజొన్న కాంటావేస్తూ అన్నదాత శ్రమను దోచుకుంటున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ముళ్ల త్రాసుతో తూకం వేయడంతో రైతులు క్వింటాకు సగటున కిలో చొప్పున నష్టపోతారని, మొత్తంగా చూస్తే ఇది భారీగా ఉంటుందని చెబుతున్నారు. అయితే మొక్కజొన్న విక్రయాలు ఇప్పటికే 50 శాతం దాటాయని..ఇకనైనా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేయకపోతే వ్యాపారులకు తప్ప రైతులకు ప్రయోజనం ఉండదనే ఆందోళన వ్యక్తమవుతోంది.

ఎప్పుడు ఏర్పాటు చేస్తరో..



ఐదెకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేశాను. పంట విక్రయం కోసం గతంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రం వద్దకు చేర్చాను. తేమ శాతం మెరుగ్గా ఉండేలా ఆరబెట్టుకుంటున్నాను. ప్రభుత్వం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఎప్పుడు ఏర్పాటు చేస్తుందో ఇంకా తెలియడం లేదు.

– గుగులోత్ మంగీలాల్, రైతు, కొమరారం, ఇల్లెందు మండలం

దిగుబడి భారీగా తగ్గింది



అతివృష్టి, అనావృష్టి కారణంగా దిగుబడి భారీగా తగ్గింది. గతంలో ఎకరానికి 25 క్వింటాళ్లు వచ్చేది. కానీ ఈసారి 15 క్వింటాళ్లు కూడా దాటలేదు. బహిరంగ మార్కెట్‌కు పంట తీసుకెళ్తే మోసం చేస్తారనే భయం వేస్తోంది. అందుకే ప్రభుత్వ కొనుగోలు కేంద్రం కోసం ఎదురుచూస్తున్నాం.

– భూక్యా చిన్నా , రైతు, కొమరారం, ఇల్లెందు మండలం

కార్పొరేటర్ జగన్‌కు నివాళులర్పించిన మంత్రులు

ఖమ్మంఅర్బన్: ఖమ్మం 3వ డివిజన్ కార్పొరేటర్ మలీదు జగన్ సోమవారం గుండెపోటుతో మృతి చెందగా ఆయన మృతదేహాన్ని మంగళవారం బల్లేపల్లిలోని స్వగృహానికి తీసుకొచ్చారు. ఈ మేరకు రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, కేఎంసీ మేయర్ పి.నీరజ, కమిషనర్ అభిషేక్ అగస్త్య తదితరులు మృతదేహం వద్ద నివాళులర్పించి జగన్ సతీమణి నాగమణి, కుటుంబీకులను ఓదార్చారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు కమర్తపు మురళి, లకావత్ సైదులు, మలీదు వెంకటేశ్వర్లు, రఘునాథపాలెం పీఏసీఎస్ అధ్యక్షుడు తాతా రఘురాంతో పాటు మానుకొండ రాధాకిషోర్, నల్లమల వెంకటేశ్వర్లు, భూక్యా బాషా, గుత్తా వెంకటేశ్వర్లు, కొంగర జోతిర్మయి, దొబ్బల సౌజన్య, యరగర్ల హన్మంతరావు తదితరులు పాల్గొన్నారు. తొలుత హైదరాబాద్ నుండి తీసుకొచ్చిన జగన్ మృతదేహాన్ని ఖమ్మంలోని ఎన్టీఆర్ సర్కిల్ నుంచి భారీ ర్యాలీగా ఇంటికి తీసుకెళ్లారు. కాగా, ఆయన అంత్యక్రియలు బుధవారం జరగనున్నాయి.



జగన్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రులు పొంగులేటి, తుమ్మల, మేయర్ నీరజ, కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ తదితరులు

పంటల రీ సర్వేను అడ్డుకున్న రైతులు

బోనకల్: మండలంలోని రాపల్లిలో పంట నష్టపరిహారం జాబితాలో అవకతవకలు జరిగాయని పలువురు రైతులు కలెక్టర్‌కు ఇటీవల ఫిర్యాదు చేశారు. దీంతో ఏఓలు నారాయణరావు, శరత్, నాగేశ్వరావుతో పాటు ఏఈఓలు నాగసాయి, హుస్సేన్ మంగళవారం రీ సర్వే చేసేందుకు వచ్చారు. ఈక్రమాన రైతులు విడిపోయి తమ పొలాలను ఎదుటి వర్గం చూపించడమేమిటని ఒక వర్గం, అనర్హుల పేర్లను జాబితాలో చేర్చినందున రీ సర్వే చేయాల్సిందేనని ఇంకో వర్గం వారు పట్టుబట్టారు. దీంతో అధికారులు వెనుదిరిగారు. రెండు వర్గాల మధ్య ఘర్షణ జరుగుతుందనే అనుమానంతో వెళ్లిపోయామని అధికారులు తెలిపారు.

వృద్ధుడి ఆత్మహత్య

చింతకాని: మండలంలోని చిన్నమండవకు చెందిన అలవాల సత్యనారాయణ(70) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. గత పదేళ్లుగా పక్షవాతంతో బాధపడుతున్న ఆయన మనోవేదనకు గురై సోమవారం అర్ధరాత్రి పురుగుల మందు తాగాడు. ఈవిషయాన్ని గమనించిన కుటుంబీకులు ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. ఘటనపై సత్యనారాయణ కుమారుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగుల్‌మీరా తెలిపారు.

విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి..

పీఆర్‌టీయూ తెలంగాణ వ్యవస్థాపక అధ్యక్షుడు హర్షవర్ధన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న హర్షవర్ధన్‌రెడ్డి

ఖమ్మం సహకారనగర్: ఉపాధ్యాయులు, విద్యారంగం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పీఆర్‌టీయూ తెలంగాణ వ్యవస్థాపక అధ్యక్షుడు గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి తెలిపారు. ఖమ్మంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో గత పదేళ్లుగా విద్యారంగానికి సంబంధించి సమస్యలు పేరుకుపోయాయన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన పది నెలల్లోనే పండిట్లు, పీటీటీల అప్‌గ్రెడేషన్, బదిలీలు, పదోన్నతులు, పోస్టుల భర్తీ చేపట్టిందన్నారు. ఈ నేపథ్యాన రెండు దశాబ్దాలుగా ఉపాధ్యాయుల పక్షాన పోరాడుతున్న తనను నలగొండ- ఖమ్మం-వరంగల్ జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానం గెలిపించాలని కోరారు. తనను గెలిపిస్తే ఉపాధ్యాయుల సర్వీస్ రూల్స్, సీపీఎస్ రద్దు తదితర సమస్యల పరిష్కారానికి పాటుపడతానని తెలిపారు. సంఘం జిల్లా అధ్యక్షుడు కొమ్మినేని అనిల్‌కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు గార్లపాటి ఉమాకర్‌రెడ్డితో పాటు బాలాజీనాయక్, ముత్తినేని సురేష్, మట్టా శ్రీనివాసరావు, శిరీష, ఓంప్రకాష్, వీరూనాయక్, నాగుల్‌మీరా, దుబాకుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సమాన పనికి సమాన వేతనం కల్పించాలి

ఖమ్మంఅర్బన్: సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం కల్పించేలా కృషి చేయాలని రాష్ట్ర సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జేఏసీ లీగల్ అడ్వైజర్ తాళ్లపల్లి వెంకటరత్నం కోరారు. ఈమేరకు హర్షవర్ధన్‌రెడ్డికి ఆయన వినతిపత్రం అందజేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రుద్రగిరి గిరి, ఇస్మాయిల్, సైదమ్మ, షేక్ యాకుబ్ పాషా, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

చింతకాని మేజర్ కాల్వకు గండి



గండి పడిన చోట పోతున్న నీరు

చింతకాని: సాగర్ ప్రాజెక్టు పరిధిలో చింతకాని మేజర్ కాల్వకు బస్వాపురం గ్రామ సమీపాన గండి పడింది. ఈమేరకు 7 కిలోమీటర్ వద్ద మంగళవారం ఉదయం కాల్వకు గండి పడగా సాగర్ జలాలు వృధాగా పోతుండడంతో అధికారులు నీటి సరఫరా నిలిపివేశారు. మరమ్మతుల అనంతరం తిరిగి నీరు విడుదల చేయనున్నట్లు తెలిపారు.

మళ్లీ ఏఈఓల ఆందోళనబాట

- నల్లబ్యాడ్జీలు ధరించి నేలపై కూర్చుని విధి నిర్వహణ
- ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్



నేలకొండపల్లిలో నేలపై కూర్చుని నిరసన తెలుపుతున్న ఏఈఓలు

ఖమ్మంవ్యవసాయం: ప్రభుత్వం పక్షాన ఉన్నతాధికారులు హామీల అమల్లో జాప్యం జరుగుతోందని చెబుతూ వ్యవసాయ విస్తర్ణాధికారు(ఏఈఓ)లు మళ్లీ ఆందోళన బాట పట్టారు. ఈమేరకు మంగళవారం ఏఈఓలు నల్ల బ్యాడ్జీలు ధరించి నేలపై కూర్చుని విధులు నిర్వర్తించారు. డిజిటల్ క్రాప్ సర్వే(డీసీఎస్) నిర్వహణ భారమవుతుందని, పొరుగు రాష్ట్రాల్లో మాదిరి ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించాలని లేదంటే సహాయకులను నియమించాలనే డిమాండ్‌తో కొన్నాళ్లుగా నిరసన తెలుపుతున్న విషయం విదితమే. ఈమేరకు ఉన్నతాధికారుల సూచనలతో ఆందోళనలు విరమించి సర్వే మొదలుపెట్టారు. అయితే, హామీలు నెరవేరకపోగా, సస్పెండ్ చేసిన ఏఈఓలను విధుల్లోకి తీసుకోకపోవడం, వేతనాల బిల్లుల్లో ద్వంద్వ విధానం అమలుచేస్తున్నారంటూ తిరిగి ఆందోళనలు ప్రారంభించారు. ఈ మేరకు మంగళవారం రైతు వేదికల్లో నిర్వహించిన రైతు నేస్తం కార్యక్రమాల్లో ఏఈఓలు నేలపై కూర్చుని విధులు నిర్వహించారు. అలాగే, ఏఈఓల సంఘం ప్రతినిధులు నాగుల్ మీరా, శ్రీకాంత్, బాలకృష్ణ, హిందూ, భవాని, లిఖిత, అయేషా, సుష్మ, జిష్ణు, వంశీ, శివ, గురుమూర్తి తదితరులు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను కలిసి వినతిపత్రం అందించారు.

నేలకొండపల్లిలో...

నేలకొండపల్లి: సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో ఏఈఓలు మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం జరిగిన రైతు నేస్తం కార్యక్రమంలో నేలపై కూర్చుని నిరసన తెలిపారు. ఏఈఓల సంఘం నాయకుడు అవినాష్‌తోపాటు బి.శిరీష, అరవింద్, శశిరేఖ, సాయి నిఖిల, నవీన్, ఈశ్వరి తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో ఓపెన్‌హౌస్

ఖమ్మంక్రైం: పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా ఖమ్మంలోని సిటీ ఆర్మ్‌డ్ పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో మంగళవారం ఓపెన్‌హౌస్ నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ పాఠశాలల విద్యార్థులు హాజరుకాగా పోలీసులు విధినిర్వహణలో వినియోగించే ఆయుధాలు, ఇతర సామగ్రి పనితీరును అడిషనల్ డీసీపీ నరేష్‌కుమార్ వివరించారు. ఏకే 47 తదితర అత్యాధునిక ఆయుధాలు, బ్రీత్ ఎనలైజర్లు, పోలీస్ జాగిలాలను ప్రదర్శించగా, నేరస్తుల గుర్తింపు, అల్లరిమూకలను అదుపు చేసే విధానాన్ని వివరించారు. ఈకార్యక్రమంలో ఆర్ఐ కామరాజు, ఐటీ కోర్ ఎస్ఐ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



ఏకే - 47 ప్రత్యేకతలను వివరిస్తున్న అడిషనల్ డీసీపీ నరేష్‌కుమార్

ఎస్సీ వర్గీకరణ ప్రయత్నాలు మానుకోవాలి

మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు సుధాకర్



పాదయాత్రకు స్వాగతం పలుకుతున్న నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ వర్గీకరణ ప్రయత్నాలను మానుకోవాలని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగానే కాక దళితుల ఐక్యత కోసం మాల మహానాడు ఆధ్వర్యాన భద్రాచలం నుండి హైదరాబాద్ వరకు చేపట్టిన మహా పాదయాత్ర మంగళవారం ఖమ్మం చేరుకుంది. ఈసందర్భంగా యూనిటీ ఆఫ్ మాల, మాల మహానాడు నాయకులు జెడ్పీ సెంటర్‌లో సుధాకర్, నాయకులకు స్వాగతం పలికారు. ఈమేరకు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిక సుధాకర్ మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణకు అనుకూలమంటూ వాస్తవ పరిస్థితులను పరిగణనలోకి తీసుకోకుండా ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటన చేశారని విమర్శించారు. ఓట్లు వేసి కాంగ్రెస్‌ను గెలిపిస్తే ఇప్పుడు మాలలకు అన్యాయం చేయడమేమిటని ప్రశ్నించారు. ఇకనైనా వర్గీకరణ ప్రయత్నాలు విరమించుకోకపోతే మాలల ఆగ్రహానికి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం గురికాక తప్పదని హెచ్చరించారు. కాగా, డిసెంబర్ 1న యాత్ర ముగింపు సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించే సభకు మాలలు తరలిరావాలని సుధాకర్ కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు కందుల ఉపేందర్, ఏ.మధు, జాగటి మధు, బీ.జీ.క్లెమైంట్, కనకయ్య, శ్రీను, ఎల్లయ్య, నాగలక్ష్మి, కామా ప్రభాకర్, శ్రీరాములు, రవి, సురేష్, ఎం.రవి, రాము, రామకృష్ణ, మనోజ్, వినయ్, కనకరత్నం, రాంబాబు, జానయ్య తదితరులు పాల్గొన్నారు.

రూ.10 లక్షలు రికవరీ, రూ.1.39 లక్షల జరిమానా

ముగిసిన సామాజిక తనిఖీ ప్రజావేదిక



మాట్లాడుతున్న అడిషనల్ డీఆర్‌డీఓ

కామేపల్లి: కామేపల్లిలో మండలం గత ఆర్థిక సంవత్సరం చేపట్టిన ఈజీఎస్ పనులపై చేపట్టిన సామాజిక తనిఖీ ప్రజావేదిక మంగళవారంతో ముగిసింది. ఈ సందర్భంగా అడిషినల్ డీఆర్‌డీఓ శిరిష మాట్లాడారు. ఒకే వ్యక్తికి రెండేసి జాబ్‌కార్డుల జారీ, మస్టర్ల నిర్వహణలో లోపాలు, అంచనా వేసిన పనికి అదనంగా ఉండడంతో పాటు కొలతల్లో తేడాలు గుర్తించామని తెలిపారు. అలాగే, ఎంబీ రికార్డు చేయకుండానే చెల్లింపులు బయటపడ్డాయమని చెప్పారు. ఈ మేరకు అవకతవకలకు పాల్పడిన కార్యదర్శులు, ఫీల్డ్ అసిసెంట్లు, టీఏలకు రూ.1.39లక్షల జరిమానా విధించగా రూ.10,36,271 లక్షల రికవరీకి నిర్ణయించినట్లు తెలిపారు. అంతేకాక గోవింద్రాలలో ఇద్దరు, బర్లగూడెంలో ఒక సీనియర్ మేట్‌ను తొలగించామని, కెప్టెన్ బంజర కార్యదర్శికి షోకాజ్ నోటీస్ జారీ చేశామని చెప్పారు. ఈ సమావేశంలో పవన్, రమేష్, వెంకటపతిరాజు, శ్రీరాణి, సాంబశివాచారి పాల్గొన్నారు.

ఫంక్షన్‌కు వెళ్లొచ్చే సరికి చోరీ

నేలకొండపల్లి: మండలంలోని చెన్నారం గ్రామంలో చోరీ జరిగింది. గ్రామానికి చెందిన బట్టపోతుల క్రాంతి-అంజలి దంపతులు డబుల్ బెడ్‌రూం ఇళ్ల సముదాయంలో నివాసం ఉంటున్నారు. వీరు మంగళవారం ఓ పంక్షన్‌కు వెళ్లొచ్చే సరికి ఇంటి తలుపులు, బీరువా పగలగొట్టి ఉన్నాయి. ఈమేరకు రూ.10 వేల నగదు, రెండు జతల చెవిదిద్దులు, పట్టీలు చోరీ జరిగాయని పోలీసులు ఫిర్యాదు చేశారు.

పాలేరు జలాశయంలో మృతదేహం లభ్యం

కూసుమంచి: మండలంలోని పాలేరు జలాశయంలో మంగళవారం ఓ వ్యక్తి మృతదేహం లభ్యమైంది. మృతుడిని ముదిగొండ మండలం సువర్ణాపురానికి చెందిన పసుపులేటి రామకృష్ణ(52)గా కుటుంబీకులు గుర్తించారు. ఆయన సోమవారం తమ గ్రామానికి చెందిన వ్యక్తి ఆటోలో పాలేరు రిజర్వాయర్ వద్దకు చేరుకున్నాడు. స్నేహితుడు వస్తున్నాడని చెప్పి ఆటోడ్రైవర్‌ను పంపించగా ఆయన కుటుంబీకులకు ఫోన్‌లో సమాచారం ఇచ్చారు. దీంతో రామకృష్ణ కుటుంబసభ్యులు చేరుకుని గాలిస్తుండగా మంగళవారం ఉదయం పాలేరు ఔట్ ఫాల్ కాల్వ గేటు వద్ద మృతదేహం లభ్యమైంది. ఘటనపై ఆయన సోదరుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.